ఘనంగా బాలికా దినోత్సవం


రైల్వే స్టేషన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్నసిబ్బంది

లక్ష్మీపురం: గుంటూరు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్-1098 గుంటూరు ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ కిరణ్ మాట్లాడుతూ బాలురకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తారో బాలికలకు కూడా అంతే ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం బాలికలను చదివిద్దాం-బాలికలను రక్షిద్దాం అనే అంశాలపై రైలు ప్రయాణికులకు, ఉద్యోగులకు స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ బృంద సభ్యులు వాకా లక్ష్మణ్ నందన్, సావిత్రి, జెల్సియా, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ వై.నాగేశ్వరరావు, జీఆర్పీ ఏఎస్‌ఐ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో పలు ప్రాజెక్ట్‌ల నిర్వహణ పరిశీలన


జీహెచ్ఎంసీ అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గ్రేటర్ హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని దుర్గం చెరువు సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, హైదరాబాదు మెట్రో వాటర్ ప్రాజెక్ట్, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బృందం శుక్రువారం పరిశీలించింది. ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లలో అమలు చేస్తున్న కార్యక్రమాల స్టడీ టూర్‌లో భాగంగా శుక్రువారం జీహెచ్ఎంసీలో వివిధ ప్రాజెక్ట్‌లను నగర కమిషనర్ బృందం పరిశీలించింది. తొలుత దుర్గం చెరువులోని ఎస్టీపీ ప్లాంట్ వివరాలను స్థానిక అధికారులు వివరించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను, పనితీరుని పూర్తి స్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తొలత దుర్గం చెరువు ఎస్టీపీని పరిశీలించారు. దాని సామర్థ్యం, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ విధానాన్ని వివరంగా అడిగి తెలుసుకున్నారు. వాటర్ శాంపిల్స్‌ని పరిశీలించారు. అనంతరం గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను పరిశీలించారు. ప్రతిరోజు చెత్తని తీసుకొచ్చే తీరుని, వాటి నిర్వహణను తెలుసుకున్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కార్యాలయంలోని విభాగాలు, పని చేసే సిబ్బంది, సమస్యలపై స్పందించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్తున్నారో పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్ట్‌ల పరిశీలనలో భాగంగా హైదరాబాదు మెట్రో వాటర్ ప్రాజెక్ట్‌ని సందర్శించారు. తాగునీటి సరిఫరా, తాగునీటి శుద్ధి పైపులైన్‌లను పరిశీలించారు.

కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్న కూటమి

పట్నంబజారు: గుంటూరు సబ్ జైలులో అస్వస్థతకు గురై శుక్రవారం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చిన బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు), పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పరామర్శించారు. ఈ సందర్భంగా డైమండ్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా కూటమి నేతలు అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి నేతలు ఉద్దేశపూర్వకంగా మాజీ ఎంపీ సురేష్‌ను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు జగనన్న, తాము ఎంత దూరమైనా వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

బ్రహ్మారెడ్డిని సత్కరించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి


బ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పక్కన పోలూరి తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని విద్యానగర్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా నియమితులైన వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రహ్మారెడ్డి వెంట గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర నేత పోలూరి వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, ఇతర న్యాయవాదులు ఉన్నారు.
ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డిని దుశ్శాలువ, జ్ఞాపికతో అప్పిరెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ న్యాయం పక్షాన నిలబడే న్యాయవాది బ్రహ్మారెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో కళ్ళం వెంకటరమణారెడ్డి, పి.బాబూరావు, మొండితోక శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, అడపా ఇందిర, క్రాంతి తదితరులు ఉన్నారు. విజయదశమి పురస్కరించుకుని ప్రజలకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మ ఆశీస్సులతో అంతా మేలు జరగాలి

తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా


నూరిఫాతిమాను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలకు అమ్మవారి ఆశీస్సులతో అంతా మేలు జరగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆకాంక్షించారు. నవరాత్రులు పురస్కరించుకొని తూర్పు నియోజకవర్గ పరిధిలోని పరమాయకుంట కాళికామాత దేవస్థానం, పొన్నూరు రోడ్డు కనకదుర్గమ్మ దేవస్థానం, సంగడిగుంట రెడ్ల బజార్ పోలేరమ్మ దేవస్థానం, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలకు అంతా మంచే జరగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. చెడుపై మంచి గెలిచినందుకు దసరాను జరుపుకుంటామని, కచ్చితంగా కూటమి ప్రజలకు చేస్తున్న చెడును వైఎస్సార్ సీపీ అడ్డుకుని, వారికి మంచి చేస్తుందని చెప్పారు. అమ్మ వారి దయతో రానున్న ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామని తెలిపారు. ఆయా ఆలయాల్లో నూరిఫాతిమాను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం సభ్యులు నిడమానూరు సురేష్, డీపీ, రత్న ప్రసాద్ , మొగిలి సతీష్, వీరారెడ్డి, వాకా శ్రీనివాస్‌రెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సింగరెడ్డి తిరుపతిరెడ్డి, పల్లా శ్రీనివాస్, కేసరి సుబ్బులు, స్వాతి, శైలజ, వసుంధర, ప్రియాంక పాల్గొన్నారు.


సంగడిగుంట రెడ్లబజార్ శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో ..


కొత్తపేట శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ..


లాలాపేట శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీజయలక్ష్మీదేవిగా..


ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..


కొత్తపేట శ్రీజగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీజయలక్ష్మీదేవిగా..


ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో విజయలక్ష్మీదేవిగా..

జయ జయహే మహిషాసుర మర్దిని

దేవీ శరన్నవరాత్రులలో భాగంగా తొమ్మిదో రోజైన శుక్రవారం ఆదిపరాశక్తి స్వరూపమైన అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అరుణారుణశోభతో ప్రకాశిస్తూ దేదీప్యమానంగా వెలిగారు. అఖండ హారతులు, వేదమంత్రాల మధ్య జగజ్జనని సర్వశుభశోభితై భాసిల్లింది.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాలలో సర్వమంగళకారిణియైన లోకమాతకు అర్చనలు, ప్రత్యేక పూజలు, నైవేద్యాలతో విశేషంగా పూజలు నిర్వహించారు.

– నగరంపాలెం

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మారుతీనగర్‌లోని శ్రీ కంచికామకోటి పీఠ శ్రీ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం గో పూజ, బాల పూజ, సువాసిని పూజలు, అమ్మవారికి సహస్రనామార్చనలతో పాటు చండీ హోమం నిర్వహించారు. ప్రదోషకాల సహస్రనామార్చన, అమ్మవారికి నీరాజనం, మహా మంత్రపుష్పం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అవోపా ఆధ్వర్యంలో గో సేవ



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని గుంటూరువారి తోటలోని రాధా కృష్ణ గోశాలలో శుక్రవారం ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో గో సేవ, గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అవోపా సభ్యులు గోవులను శుభ్రంగా కడిగారు. పసుపుకుంకుమలతో పూజలు నిర్వహించి ఆహారాన్ని అందించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణంతోపాటు కుంకుమ పూజలు నిర్వహించారు.
అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రుల్లో గోమాతను పూజించడం వల్ల అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. గ్రహ దోషాల నివారణ జరుగుతుందని, గోవు ఉత్పత్తులు ఉపయోగించడం వల్ల దీర్ఘకాలిక రోగాలు నివారణ జరుగుతాయని చెప్పారు. అనంతరం మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులకు గో ఉత్పత్తులను పంపిణీ చేశారు. మహిళలకు పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోపాలరావు, చామర్తి రమేష్, కంచర్ల వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలకు స్వయం ప్రతిపత్తిపై హర్షం

నగరంపాలెం: దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంపై ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణం వేణుగోపాల్, జంధ్యాల వెంకటరామలింగేశ్వరశాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ జీవో విడుదలతో ఏపీలోని దేవాలయాలకు ఆచార, సంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా ఉంటుందని వారు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.